# ఆధునిక భారతదేశ చరిత్ర

## సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాలు

క్రీ.శ.19వ శతాబ్దంలో భారతదేశంలో వచ్చిన సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాన్నే 'సాంస్కృతిక పునరుజ్జీవనం' అంటారు. ఈ ఉద్యమాలు, సంస్కరణలు భారతీయుల్లో అంకురిస్తున్న జాతీయవాద స్పృహ, పాశ్చాత్య ఉదారభావ ధోరణి రెండింటినీ ప్రతిబింబిస్తాయని ఎ.ఆర్. దేశాయ్ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, ప్రార్థనా సమాజం, దివ్యజ్ఞాన సమాజం, రామకృష్ణమిషన్ లాంటి సంస్థలు మత సంస్కరణతో పాటు సాంఘిక సంస్కరణకూ కృషి చేశాయి. మన దేశ సంస్కృతిని పునరుద్ధరించడానికి, భారతీయుల్లో జాతీయ చైతన్యాన్ని ప్రేరేపించడానికి రాజా రామ్మోహన్‌రాయ్, స్వామి దయానంద సరస్వతి, స్వామి వివేకానంద లాంటి భారతీయులతోపాటు ఐర్లాండ్‌కు చెందిన అనిబిసెంట్ కూడా ఎంతో కృషి చేశారు. 'భారతీయ సాంస్కృతిక పునర్వికాస పితామహుడి'గా రాజా రామ్మోహన్‌రాయ్ పేరొందారు. 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక పునర్వికాస పితామహుడి'గా కందుకూరి వీరేశలింగం ప్రసిద్ధిచెందారు.

### బ్రహ్మ సమాజం

రాజా రామ్మోహన్‌రాయ్ 1815లో ఆత్మీయ సభను స్థాపించారు. దాన్నే 1828లో బ్రహ్మ సమాజంగా మార్చారు. ఏకేశ్వరోపాసన, వర్ణ వ్యవస్థ రద్దు, విగ్రహారాధన నిర్మూలన లాంటి లక్ష్యాలు, సిద్ధాంతాలతో బ్రహ్మ సమాజం పనిచేసింది. పురోహితులు, పూజారుల అవసరంలేదని, వర్ణాంతర వివాహాలు, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించాలని, బాల్య వివాహాలు, బహు భార్యత్వం, దేవదాసీ వ్యవస్థ, సతీ సహగమనం లాంటి సాంఘిక దురాచారాలను నిర్మూలించాలని బ్రహ్మ సమాజం పిలుపునిచ్చింది. రాజా రామ్మోహన్‌రాయ్ మరణానంతరం రామచంద్ర విద్యా వాగీష్ బ్రహ్మ సమాజానికి నాయకత్వం వహించారు. ద్వారకానాథ్ ఠాగూర్ ఆర్థిక సహాయంతో నామమాత్రంగా బ్రహ్మ సమాజం నడిచేది. మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్ నాయకత్వంలో బ్రహ్మ సమాజం తిరిగి బలపడింది. కేశవ చంద్రసేన్ రాకతో అది దక్షిణ భారతదేశానికి కూడా విస్తరించింది. 1866లో బ్రహ్మ సమాజం సిద్ధాంత విభేదాల వల్ల ఆదిబ్రహ్మ సమాజం, నవ వర్షీయ భారత బ్రహ్మ సమాజంగా విడిపోయింది. ఆదిబ్రహ్మ సమాజానికి దేవేంద్రనాథ్ ఠాగూర్, నవబ్రహ్మ సమాజానికి కేశవ చంద్రసేన్ నాయకత్వం వహించారు. తారాచంద్ అనే చరిత్రకారుడు బ్రహ్మ సమాజ కార్యదర్శిగా పనిచేశారు. బ్రహ్మ సమాజీకులు ప్రతి శనివారం సాయంత్రం సమావేశాలు నిర్వహించేవారు. 1878లో ఆనంద్‌బోస్ సాధారణ బ్రహ్మసమాజం అనే మరో శాఖను ఏర్పాటు చేశారు. కేశవ చంద్రసేన్ ప్రభావంతో మద్రాస్‌లో రాజగోపాలాచారి, సుబ్బరాయలు శెట్టి మొదలైనవారు వేద సమాజాన్ని స్థాపించారు. దీని పేరును తర్వాతి కాలంలో దక్షిణ భారత బ్రహ్మ సమాజంగా మార్చారు. ఆంధ్రదేశంలో మన్నవ బుచ్చయ్య పంతులు, కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వేంకటరత్నం నాయుడు, పిఠాపురం రాజా లాంటి వారు బ్రహ్మ సమాజ సేవలను విస్తరించారు.

### దేవేంద్రనాథ్ ఠాగూర్

ఈయన 1817లో బెంగాల్‌లో జన్మించారు. 1838లో బ్రహ్మ సమాజంలో చేరి 1839లో తత్వబోధిని సభను, తత్వబోధిని పత్రికను, తత్వబోధిని పాఠశాలను స్థాపించారు. 'బ్రహ్మధర్మం' అనే గ్రంథాన్ని కూడా రాశారు. 'మహా నిర్వాణ తంత్ర' అనే గ్రంథ సూత్రాలను అనుసరించి బ్రహ్మ సమాజ సభ్యులకు 'ప్రమాణ కర్మ' విధానాన్ని ఏర్పాటు చేశారు. దేవేంద్రనాథ్ ఠాగూర్ వేదాల అమోఘత్వ సిద్ధాంతాన్ని అక్షయ్ కుమార్ దత్తా లాంటి సమకాలీనులు వ్యతిరేకించారు. దేవేంద్రనాథ్ ఠాగూర్‌కు శిష్యుడైన కేశవ చంద్రసేన్‌తో సిద్ధాంతపరమైన విభేదాల వల్ల 1866లో బ్రహ్మ సమాజంలో చీలిక ఏర్పడింది. దేవేంద్రనాథ్ ఠాగూర్ నాయకత్వంలో ఆది బ్రహ్మ సమాజం ఏర్పడింది. ఈయన మరణానంతరం రాజ నారాయణ బోస్ ఆది బ్రహ్మ సమాజానికి నాయకుడయ్యాడు.

### కేశవ చంద్రసేన్

బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను దేశవ్యాప్తంగా ప్రచారం చేసిన వ్యక్తి కేశవ చంద్రసేన్. ఈయన 1857లో బ్రహ్మ సమాజంలో చేరారు. సంగత్ సభను (సంగీత సభ) ఏర్పాటు చేశారు. 1866లో నవ భారత వర్షీయ బ్రహ్మ సమాజానికి నాయకుడయ్యాడు. ఈయన కృషి ఫలితంగానే 1872లో బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని (నేటివ్ సివిల్ మ్యారేజ్ యాక్ట్) చేశారు. దీని ప్రకారం బాలికల వివాహ వయసు 12, బాలుర వివాహ వయసును 14 సంవత్సరాలుగా నిర్ణయించారు. కానీ తన కుమార్తెకు బాల్య వివాహం చేసి విమర్శల పాలయ్యారు. సేన్ తన కుమార్తె రమాబాయిని కూచ్ బిహారీ యువరాజుకిచ్చి బాల్య వివాహం చేశారు. ఫలితంగా 1878లో శివనాథశాస్త్రి, ఆనంద మోహన్ బోస్‌లు సాధారణ బ్రహ్మ సమాజాన్ని స్థాపించారు. కేశవ చంద్రసేన్ భారత సంస్కరణ సమాజాన్ని స్థాపించి, దాని తరపున 'సులభ్ సమాచార్' పత్రికను నడిపారు. ఆ రోజుల్లో ఆ పత్రిక ఖరీదు ఒక పైసా మాత్రమే.

## రాజా రామ్మోహన్‌రాయ్

రాజా రామ్మోహన్‌రాయ్ 1774లో బెంగాల్‌లోని బర్ధ్వాన్ జిల్లాలో ఉన్న రాధానగర్‌లో జన్మించారు. కానీ రాయ్ జీవిత చరిత్రను రాసిన సోఫియా డాబ్సన్ కోవెట్ 1772లో జన్మించినట్లు రాశారు. రాయ్ కాశీలో సంస్కృత భాషను అభ్యసించారు. ఈయన గొప్ప రచయిత. బహుభాషా కోవిధుడు. ఈయన 'ఏకేశ్వరోపాసకులకు ఒక కానుక' ('తుహఫత్-ఉల్-మువాహిద్దీన్' లేదా A Gift to Monothies) అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించారు. ఇంకా జీసస్ బోధనలు, శాంతి సంతోషాలకు మార్గం అనే గ్రంథాలు కూడా రచించారు. నాటి రంగపూర్ కలెక్టర్ విలియం డిగ్బే వద్ద దివాన్‌గా పనిచేశారు. హరిహరానంద తీర్థస్వామి సహాయంతో తాంత్రిక గ్రంథాలను అధ్యయనం చేశారు. 1815లో ఆత్మీయ సభను, 1825లో వేదాంత కళాశాలను, 1828లో బ్రహ్మ సమాజాన్నీ, 1830లో బ్రహ్మ మందిరాన్ని స్థాపించారు. విలియమ్ ఆడమ్స్ అనే బాప్టిస్ట్ మతాచార్యుడు రాయ్ ఏకేశ్వరవాదాన్ని స్వీకరించారు. రాజా రామ్మోహన్‌రాయ్ గొప్ప పత్రికా సంపాదకుడు. ఈయన 'సంవాద కౌముది' అనే బెంగాలీ వార పత్రికను 'మిరాతువ్ అక్బర్' అనే పారశీక పత్రికను ప్రచురించారు. రాయ్ కృషి ఫలితంగానే 1829లో విలియం బెంటింక్ సతీ సహగమన పద్ధతిని రద్దు చేశాడు. ఆంగ్ల విద్యను భారతీయులకు అందుబాటులోకి తేవాలని రాయ్ వాదించారు. రాయ్ ఉద్యమాన్ని వ్యతిరేకించిన సనాతన హిందువులు రాధాకాంత్ దేవ్ నాయకత్వంలో ధర్మసభను నెలకొల్పి 'సమాచార చంద్రిక' అనే పత్రికను స్థాపించారు. ఆ పత్రికలో రాజా రామ్మోహన్‌రాయ్ ఉద్యమ విధానాన్ని విమర్శించేవారు. నాటి మొగల్ చక్రవర్తి రెండో అక్బర్ 1832లో రామ్మోహన్‌రాయ్‌కు 'రాజా' అనే బిరుదును ఇచ్చి, తన తరపున ఇంగ్లండ్ పంపించాడు. కానీ 1833లో రాయ్ ఇంగ్లండ్‌లోని బ్రిస్టల్ నగరంలో మరణించారు.

**రచయిత: బొత్స నాగరాజు**

www.eenadupratibha.net